క్లుప్తంగా

నేడు మేకా ప్రతాప్ ప్రచారం

చాట్రాయి: మండలంలోని పలు గ్రామాల్లో నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. ఉదయం 8 గంటలకు మండలంలోని సోమవరం, కొత్తగూడెం, మర్లపాలెం, మధ్యాహ్నం 4 గంటలకు చనబండ, సూరంపాలెం, కృష్ణారావుపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు.

సంక్షేమ పాలనతో మేలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): నవరత్న పథకాలతో నవశకం వైపు అడుగులు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అండగా నిలవాలని కొండపల్లి ఐదో వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థి సర్నాల తిరుపతిరావు సతీమణి నాగలక్ష్మి, ఆయన కుమార్తె భవానీ ఓటర్లను కోరారు. వార్డు కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, మొగిలి దయా, నాగరాజకుమారి, గంగాభవానీ, మిక్కిలి శరభయ్య, ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది శనివారం నుంచి తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మాధవి తెలిపారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని చెప్పారు.

జగనన్నకే మళ్లీ పట్టం కడదాం

ముసునూరు: పేదలందరికీ సమన్యాయం చేయడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకుందామని వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ పరిశీలకుడు గొరుముచ్చు గోపాల్ యాదవ్ అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో లోపూడి, బాసవరప్పాడు, సూరేపల్లి, రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, గుడిపాడు, గుళ్లపూడి గ్రామాల్లో గురువారం రాత్రి, శుక్రవారం కార్యకర్తల సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు.

పోలీసుల కవాతు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని వెస్ట్ జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. ఓటు నిర్భయంగా వినియోగించుకునేందుకు మూలపాడు, త్రిలోచనాపురం గ్రామాల్లో శుక్రవారం పోలీస్ కవాతు నిర్వహించి ఓటర్లలో ధైర్యం నింపారు. ప్రశాంతమైన ఓటింగ్ సరళికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు సమస్యాత్మక గ్రామాల్లో వంద మంది సాధారణ, పారామిలటరీ సిబ్బందితో కవాతు నిర్వహించామని చెప్పారు. సీఐ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరంలోని ఎంపీపీ పాఠశాల అభివృద్ధికి తెలంగాణకు చెందిన రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ హాజీ మహ్మద్ ఖలీల్ రెహ్మాన్ రూ.20 వేలను శుక్రవారం పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషాకు అందజేశారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, దాతలు, పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని ఇర్ఫాన్‌పాషా కోరారు. విరాళాలను పాఠశాల అభివృద్ధికి వినియోగిస్తామన్నారు.

గృహహింస కేసులో జైలు

తిరువూరు: భార్యను వేధింపులకు గురిచేసిన వ్యక్తికి తిరువూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గత్తం రూన్సీని 2008 నుంచి తన భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని 2013 మేలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె భర్త తీట్ల రాజశేఖర ప్రసాద్ బాబుపై వరకట్న వేధింపులు, గృహహింస కేసును తిరువూరు పోలీసులు నమోదు చేశారు. సాక్షులను విచారించిన అనంతరం రాజశేఖర ప్రసాద్ బాబుకు జడ్జి మోతీలాల్ ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

హోమ్ ఓటింగ్ వినియోగం

ఆగిరిపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలో హోమ్ ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, మంచం మీద నుంచి లేవలేని దివ్యాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ హోమ్ ఓటింగ్ సౌలభ్యాన్ని కల్పించింది. దీనిలో భాగంగా ఆగిరిపల్లి మండలంలో 11 మంది ఓటర్లు హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా సెక్టోరల్ ఆఫీసర్ శ్యాంబాబు ఆధ్వర్యంలో 9 మంది ఓటర్లు తమ ఓటు హక్కును శుక్రవారం వినియోగించుకున్నారు.

చంద్రబాబు వల్లే మాకీ కష్టాలు

- ఎండ, ఉక్కపోతకు పండుటాకుల విలవిల
- రెండో రోజూ బ్యాంకుల వద్ద పడిగాపులు
- పెన్షనర్లను రోడ్డున పడేశాడంటూ చంద్రబాబుకు శాపనార్థాలు
- వైఎస్ జగనే మళ్లీ రావాలంటూ ఆశీర్వచనాలు





ఇబ్రహీంపట్నం యూనియన్ బ్యాంక్‌లో పింఛన్ల కోసం వేచి ఉన్న పింఛన్‌దారులు : మైలవరం యూనియన్ బ్యాంక్ వద్ద బారులు తీరిన పెన్షనర్లు

మైలవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకే ముందే వలంటీర్ల ద్వారా పింఛను సొమ్మును లబ్ధిదారుల ఇంటి వద్దకే పంపించేవారు. ఇది చూసి ఓర్వలేక వలంటీర్లపై లేనిపోని ఆరోపణలు చేసి పింఛన్ల పంపిణీని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు అడ్డుకున్నారు. ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లను విధులకు దూరంగా ఉండేలా చంద్రబాబు పన్నిన కుట్ర పింఛన్ లబ్ధిదారులకు ప్రాణ సంకటంగా మారింది. వలంటీర్లను విధులకు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలతో గడపవద్దకే వస్తున్న పింఛన్లు ఆగిపోయాయి. లబ్ధిదారులే పింఛన్ కోసం సచివాలయాలకు, బ్యాంకులకు వెళ్లాల్సి రావడంతో వృద్ధులు, దివ్యాంగులకు పట్ట పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. గత నెలలో సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకున్న లబ్ధిదారులు, ఈ నెలలో బ్యాంకు ఖాతాలలో జమ చేయడంతో బ్యాంకుల వద్ద బారులు తీరారు. పలు చోట్ల సాంకేతిక సమస్యలతో పింఛన్ డబ్బులు ఖాతాలలో జమ కాలేదు. మరికొందరైతే ఖాతాలలో జమయ్యాయో, లేదో తెలియక బ్యాంకులకు వచ్చి నిరాశతో వెనుదిరిగి వెళుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు గడపవద్దకే వలంటీర్ల ద్వారా పింఛన్ డబ్బులు పంపేవారని, చంద్రబాబు కడుపు మంటతో వలంటీర్ వ్యవస్థను రద్దు చేయించడంతో వృద్ధులు, దివ్యాంగులు పెన్షన్ కోసం రోడ్డున పడ్డామని వాపోతున్నారు. ఆటోలు, బస్‌లలో బ్యాంకులకు చేరుకుని ఎండ, ఉక్కపోతకు ఇబ్బందులు పడ్డామని చెబుతున్నారు. గత నెలలో సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకున్న లబ్ధిదారులు ఈ నెల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో బ్యాంకుల వద్ద బారులు తీరారు. టీడీపీ చేసిన కుట్రకు తాము బలి అయ్యామని లబ్ధిదారులు మండి పడుతున్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ఆయన వస్తే వలంటీర్లు కూడా వస్తారని, మాకు ఇళ్లవద్దకే పింఛన్లు అందిస్తారని పలువురు వ్యాఖ్యానించారు.

పింఛన్ కోసం వృద్ధులు పడరాని పాట్లు

ఇబ్రహీంపట్నం: పింఛన్ డబ్బులు కోసం వృద్ధులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. రెండో రోజు శుక్రవారం కూడా బ్యాంకుల వద్ద పడిగాపులు పడ్డారు. ప్రభుత్వం బ్యాంక్ ఖాతాలు ఉన్న వారికి బ్యాంకుల్లో జమ చేయగా బ్యాంకుల్లో నగదు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు ఓరోజు పోతుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనికి తోడు బ్యాంక్ అధికారులు కస్టమర్ సర్వీస్ రిక్వెస్ట్ ఫారం పూర్తి చేసి తెస్తేనే డబ్బులు ఇస్తామనడంతో వాటిని పూర్తిచేయలేక దళారులను ఆశ్రయిస్తున్నా రు. ఇబ్రహీంపట్నం మండలంలో 4,895 మంది ఫించన్‌దారులకు 2,447 మందికి డోర్ టు డోర్, 2,448 మందికి డీబీటీ ద్వారా ఎంపిక చేశారు. కొండపల్లి మున్సిపాల్టీలో 5,346 మందికి డోర్ డెలివరీ 1,296, డీబీటీ 4,050 మందికి జమజేసినట్లు కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు. మైలవరం, జి.కొండూరు ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.



కోటపాడులో టెంట్ కింద పింఛన్‌దారుల ఎదురు చూపులు

- **ఆగిరిపల్లి:** సామాజిక పింఛనుదారులకు బ్యాంకుల వద్ద రెండో రోజు శుక్రవారం కూడా కష్టాలు తప్పలేదు. ఉదయం నుంచి బ్యాంకుల వద్ద వృద్ధులు, దివ్యాంగులు, వితంతు పింఛన్‌దారులు బారులు తీరారు. బ్యాంక్ ఖాతా లేనివారు సచివాలయానికి వెళ్లడం, అక్కడ పేరు లేదంటే మళ్లీ బ్యాంకులకు వచ్చి ఇబ్బందులు పడ్డారు. ఆంధ్రా బ్యాంక్, స్టేట్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, గ్రామీణ బ్యాంకుల శాఖలు పింఛన్‌దారులతో కిటకిటలాడాయి. దూర గ్రామాల నుంచి మండల కేంద్రానికి ఎండలో శ్రమలకోర్చి వచ్చిన లబ్ధిదారులు చంద్రబాబు వల్లే మాకు ఇన్ని కష్టాలు వచ్చాయని శాపనార్థాలు పెట్టారు.
- **చాట్రాయి:** మండలంలోని పింఛన్‌దారులు రెండో రోజూ శుక్రవారం బ్యాంకుల వద్ద పడిగాపులు పడ్డారు. మండుతున్న ఎండలో దూరం నుంచి బ్యాంకుల వద్దకు చేరుకునే సరికి వారు అలిసిపోయారు. కాళ్ల నొప్పులతో ఉన్న వాళ్లు, వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులు వర్ణనాతీతం. వలంటీర్లు ఇంటికి వచ్చి పొద్దున్నే పింఛన్ ఇచ్చేవారని, చంద్రబాబు నిర్వాకంతో తమకు ఈ పాట్లు తప్పడం లేదని వాపోయారు.

ఇది దుర్మార్గపు చర్య



చంద్రబాబు తీసుకున్న నిర్ణయం దుర్మార్గమైనది. గత ఐదేళ్లుగా వలంటీర్లు ఉదయాన్నే ఇంటికే వచ్చి పింఛన్లు అందజేశారు. చంద్రబాబు దుర్మార్గపు చర్య వలన బ్యాంకుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నాం. మా ఖాతాల్లో డబ్బులు పడిందీ, లేనిదీ కూడా తెలియడం లేదు. వచ్చే నెల నుంచైనా వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేయాలి.

–టి. చలపతిరావు, మైలవరం

జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి



ఇబ్రహీంపట్నం: సీఎం జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కుమారుడు సర్నాల మణికంఠ అన్నారు. ఇబ్రహీంపట్నం 12వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత చంద్రబాబు పాలనకు, నేటి జగనన్న పాలనకు ఉన్న తేడాను గుర్తించి మంచి చేసిన వారిని ఎన్నుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి ఓటర్లను కోరారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, సర్నాల తిరుపతిరావును గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మి, రవి, రాయపూడి వెంకటరావు, కోమటి కోటేశ్వరరావు, మధుబాబు, కుంచం జయరాజు, కన్నెకంటి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు కేశినేని నాని ప్రచారం

విస్సన్నపేట: వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు విస్సన్నపేటలోని సిద్ధార్థ స్కూల్ నుంచి ర్యాలీగా బయలుదేరి తాతకుంట్ల, నరసాపురం, కలగర పంచాయతీలలో పర్యటిస్తారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



జంగంగూడెంలో ప్రచారం చేస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలు చేస్తున్న చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు మండలంలోని తుక్కులూరు, పోతురెడ్డిపల్లిలో శుక్రవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతాప్ మాట్లాడుతూ ఓట్ల కోసం చంద్రబాబు అమలుకాని హామీలిస్తూ రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోకు బీజేపీ మద్దతు లేదని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుకు సాధ్యమయ్యే హామీలను మాత్రమే ఇచ్చారన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సర్పంచి తొమ్మండ్రు బుజ్జి, నాయకులు పాలడుగు నాని, అచ్చికాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి

నూజివీడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయాలని వైఎస్సార్ సీపీ నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని దేవరగుంట, జంగంగూడెంలలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ ప్రస్తుతం అమలు చేసిన పథకాలను కొనసాగించేందుకు వైఎస్సార్ సీపీని బలపర్చాలని కోరారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథాలుగా జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తారన్నారు. అందుకే అమలు చేసే హామీలనే మేనిఫేస్టోలో పేర్కొన్నారని తెలిపారు. చంద్రబాబు అమలుకు సాధ్యంకాని హామీలిస్తున్నారని, అధికారం వచ్చిన తరువాత ఆ హామీలను తుంగలో తొక్కడం చంద్రబాబుకు అలవాటన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పొట్లూరి అశోక్, పల్నాటి రఘు, ఎంపీటీసీ నక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓట్లు వేయండి

మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు



అన్నేరావుపేటలో ప్రచారం చేస్తున్న తిరుపతిరావు

రెడ్డిగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేయాలని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. శ్రీరామపురం, ముచ్చనపల్లి, అన్నేరావుపేట, కూనపరాజుపర్వ, మద్దులపర్వ గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలు తిరుపతిరావుకు ఘనస్వాగతం పలికారు. తిరుపతిరావు మాట్లాడుతూ స్థానికుడైన తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానన్నారు. డబ్బు అహకారంతో పెట్రేగిపోతున్న వసంత వెంకటకృష్ణ ప్రసాద్‌కి ఓటు అనే ఆయుధంతో ప్రతి ఒక్కరూ బుద్ధి చెప్పాలన్నారు. సామాన్యుడైన నన్ను మీలో ఒకడిగా భావించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్(నాని)కి రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, మండల కన్వీనర్ బలగాని తిరుపతిరావు, మాజీ ఎంపీపీ మైలమాల కాంతారావు, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, ఎంపీటీసీ శెట్టిపల్లి మాధవీలత, సర్పంచులు దేవళ్ల జమలయ్య, మాతంగి వెంకటేశ్వరరావు, తమక్క తిరుపతిరావు, జమలారెడ్డి, తోటకూర రవిబాబు, ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



పార్టీలో చేరిన చింతలవల్లి గ్రామ నాయకులు

ముసునూరు: సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగనన్నతోనే సాధ్యమని, ఆయన నేతృత్వంలో అందరం పార్టీ గెలుపునకు కలిసి పనిచేద్దామని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు చంటినాయన అన్నారు. గురువారం రాత్రి మండలంలోని చింతలవల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన గ్రామానికి చెందిన టీడీపీ నేతలు, ముద్దరబోయిన ముఖ్య అనుచరులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గంగుల పంగిడయ్య, సహచరులు పలగాని రంగారావు, ఆకుల వెంకట్రావు, నల్లిబోయిన గోపి, తాళ్ల శివనాగరాజు, సాయిల శివయ్య, జోనుబోయిన వెంకటేశ్వరరావు, గంగుల రాజగోపాల్, పొళ్ల వడ్డీకాసులు, పటాపంచల గోపాలస్వామి, చెన్ను శివనాగరాజు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి చంటినాయన పార్టీ కండువాలను కప్పి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించారు. సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ సుధాకర్, సొసైటీ అధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

చిత్తపూరులో..

చాట్రాయి: చిత్తపూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆడిమెల్లి మల్లయ్య, ఆడిమెల్లి తాతారావు కుటుంబాలకు చెందిన 10 మంది గురువారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. సర్పంచ్ తిరవీధి రమేష్ ఆధ్వర్యంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు దామెర చలపతిరావు, ఆడిమెల్లి లాజరు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మరో అవకాశం ఇవ్వండి

నల్లగట్ల స్వామిదాసు



గంపలగూడెం: ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో గడచిన 58 నెలలుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాభివృద్ధికి ఓటర్లు తోడ్పడాలని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెం మండలం తునికిపాడు, రాజులపాలెం, ఊటుకూరు దళితవాడలలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్వామిదాసుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్వామిదాసు మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేకపోయినప్పటికి పేద, బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి తిరువూరు ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని నానిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, ఊటుకూరు సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మీ, జెడ్పీటీసీ కోట శామ్యూల్, సర్పంచ్ నిడికొండ మాధవి, ఎంపీటీసీ నెరెళ్ల వెంకటేశ్వరరావు, వేల్పుల విజయమ్మ, నాయకులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు ఓట్లేయండి

వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు



తిరువూరు పట్టణంలో ప్రచారం చేస్తున్న స్వామిదాసు

తిరువూరు: గత ఐదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన వైఎస్సార్ సీపీ విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిందని, మళ్ళీ ఈ ఎన్నికల్లో తమ పార్టీనే గెలిపించాలని తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు కోరారు. తిరువూరు పట్టణంలోని 10, 11 వార్డులలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవరత్నాలతో పాటు ప్రజల ఇబ్బందులు గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అధికారదాహంతో అలవికాని హామీలిస్తూ, డబ్బు ప్రలోభాలకు గురిచేస్తూ ఓట్లు దండుకోవాలని చూసేవారితో నియోజకవర్గ ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని, స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా పోటీ చేస్తున్నారని విమర్శించారు. తిరువూరు నియోజకవర్గ సమగ్ర స్వరూపం, సమస్యలు తనకు తెలుసునని, తనను గెలిపిస్తే సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని స్వామిదాసు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, కాకర్లమూడి సుందరకుమార్, మోదుగు ప్రసాద్, పరసా శ్రీనివాసరావు, సత్యనారాయణ, మూడు దుర్గా, వెంకటేశ్వరి, విజయలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, పార్టీ నాయకులు రేగళ్ల మోహన్‌రెడ్డి, కాలసాని గోపాల నాగేశ్వరరావు, నాయని కోటేశ్వరరావు, అంజన్‌రెడ్డి, తిరుమలశెట్టి వేణుబాబు పాల్గొన్నారు.

- **తిరువూరు:** తెలంగాణ రాష్ట్రం నుంచి కారులో 12 మద్యం సీసాలు తీసుకువస్తు న్న ఒక వ్యక్తిని తిరు వూరు పోలీసులు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నారు. వాహనాల త నిఖీల్లో నిందితుడు ప ట్టుబడ్డారు.నింది తు డిని కారుతో సహా అ దుపులోకి తీసుకున్నారు.

అప్పారావుకు మద్దతుగా సోదరుడి ప్రచారం

నూజివీడు: రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే ఈనెల 13న జరుగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోదరుడు మేకా మోహన గోపాల అప్పారావు అన్నారు. పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో శుక్రవారం ఆయన ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లను నియమించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అందరం కలిసి రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరా. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ కంచర్ల లవకుమార్ పాల్గొన్నారు.

టీడీపీలో భగ్గుమంటున్న వర్గ విభేదాలు

రెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరిన వసంత వెంకట కృష్ణప్రసాద్ తన ఆధిపత్యాన్ని నిరూపించుకునేందుకు తన వెంట కొంతమంది వైఎస్సార్ సీపీ నాయకులను తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల రెడ్డిగూడెం మండలానికి చెందిన ఆయన సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని పార్టీలో చేర్చుకున్నారు. ఈ చేరికను గ్రామాల్లోని నాయకులు వ్యతిరేకించినప్పటికీ కృష్ణప్రసాద్ పట్టుబట్టి పార్టీలోకి ఆహ్వానించారు. అనాటి నుంచి రెడ్డిగూడెం మండలంలో టీడీపీలో వర్గ విభేదాలు నిగురుగప్పిన నిప్పులా ఉన్నాయి. మండలంలో శుక్రవారం రాత్రి టీడీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ శ్రీరామపురం గ్రామంలో ప్రచారానికి వెళ్లగా రెండు వర్గాల మధ్య వివాదం నెలకొని ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో వసంత గ్రామంలో ప్రచారం నిలిపివేసి వెనుదిరిగారు. అలాగే ఇటీవల రెడ్డిగూడెం, మిట్టగూడెం గ్రామాలలో వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తనయుడు ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం, ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇలా రెడ్డిగూడెం మండలంలో కృష్ణప్రసాద్ ప్రచార సమయంలో వర్గ విభేదాలు భగ్గుమంటుండటంతో కార్యకర్తలు డీలా పడిపోయారు.

పిడుగుపాటుకు రైతు మృతి

తిరువూరు: తిరువూరు ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం పలు చోట్ల పిడుగులు పడ్డాయి. స్థానిక రాజస్థాన్ సెంటర్‌లో పాల సేకరణ చేసే రైతు ఎనికే చంద్రశేఖర్(27) తన స్వగ్రామమైన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కందిమళ్ల వారి బంజరులో గేదెలను పొలం నుంచి ఇంటికి తోలుకెళుతుండగా సమీపంలో పిడుగు పడి షాక్‌నకు గురయ్యాడు. ఆయనను తిరువూరులోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరువూరు పట్టణంలోని షిర్డీ సాయి బాబా మందిరం సమీపంలో కూడా పిడుగు పడి ఒక తాటిచెట్టు కాలిపోయింది.

సహాయ మాత ఆలయ స్వర్ణోత్సవాలు ప్రారంభం



మైలవరం: మేరీమాత మధ్యస్థ ప్రార్థన సహాయం విశ్వాసులపై ఎల్లవేళలా ఉంటుందని అతిథి గురువు, విజయవాడ రేడియో మరియ మాత డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ బి. జాన్‌పీటర్ అన్నారు. మైలవరం శాంతినగర్‌లోని క్రైస్తవ సహాయమాత దేవాలయం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం చర్చి ప్రాంగణంలో స్వర్ణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థన కూటమిలో ఫాదర్ జాన్ పీటర్ మాట్లాడుతూ పరిశుద్ధ కన్య మరియమాత వర ప్రసాదమాతగా వెలిశారని, అవసరంలో ఉండి ప్రార్థించిన విశ్వాసులకు వారి అవసరాలు తీరుస్తున్నారని చెప్పారు. విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ ప్రసంగించారు. భీమవరప్పాడు, కోడూరు, చిన నందిగామ, గణపవరం, చంద్రాల, వెల్వడం, కుంటముక్కల, చెవుటూరు గ్రామాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, ఉపాధ్యాయ ఉపదేశకులు, స్వర్ణోత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

WALK-IN - INTERVIEW
Wanted teachers for Primary & High School. Fluency in English is essential. Attend with all original certificates on 6th May 2024 at 8:30am.
ST.XAVIER E.M PRIMARY & HIGH SCHOOL
Recognised by the Govt. of A.P.
Dr.N.T.T.P.S Road, Ibrahimpatnam-521456
For more details Contact: 0866-2882273
98485 43456, 82473 57082, 93914 36357

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు),
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com